# సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి జనసేన హారతి

### -ఆంధ్ర ప్రదేశ్ విశ్వకర్మ జయంతి పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కొల్లు రవీంద్ర



విజయవాడ సెప్టెంబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విజయవాడలో సెప్టెంబర్ 17న జరగనున్న విశ్వకర్మ జయంతి జనసేన హారతి కార్యక్రమం వాల్ పోస్టర్లు నీ ఆంధ్రప్రదేశ్ మైనింగ్ మరియు ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర తన క్యాంపు కార్యాలయంలో2024 విశ్వకర్మ జలసేన హారతి చైర్మన్గ స్వర్ణకార వృత్తిలో కోహినూరు వజ్రం ధనాలకోట శ్రీనివాస రావు వాసు తో కలిసి విశ్వకర్మ జయంతి జలసేవా హారతి2024 చైర్మన్ ధనాలకోట శ్రీనివాసరావు వాసు (వాసు) గార్లు కలిసి ఆవిష్కరించారు. విజయవాడ పున్నమి ఘాట్ లో జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కార్యక్రమాన్ని కొల్లు రవీందర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు విశ్వకర్మ జల సేవా హారతి వ్యవస్థాపకుడు కర్రి వేణు మాధవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడకి జాతీయ స్థాయిలో ఖ్యాతి తెచ్చిన స్వర్ణ కళాకారుడు ధనాలకోట శ్రీనివాసరావు వాసు అన్నారు. గారిని ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు విశ్వకర్మ జల సేవా హారతి వ్యవస్థాపకుడు కర్రి వేణు మాధవ్ కేంద్రంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రత్యేకంగా విశ్వకర్మ కౌశల్య యోజన పథకాన్ని 21-03-2023 పెట్టే ముందు 12 మంది ప్యానెల్ కమిటీలో డిల్లీ లో విజయవాడ నుంచి ఒకరిగా హాజరు ఎర్రకోట మీద జెండా వందనం 2023 ఆగస్టు 15 ప్రధానమంత్రి గారిచే ఆహ్వానం పొందిన ధనాల కోట శ్రీనివాసరావు (వాసు) వారి శ్రీమతి తారకేశ్వరి దంపతులు అలాగే సెప్టెంబర్ 17 2023న ప్రధానవ ంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ప్రారంభించిన విశ్వకర్మ కౌసల్య యెజన రకం ప్రారంభోత్సవానికి ప్రత్యేకంగా ఆహ్వానించిన పీఎంఓ కార్యాలయం వీటన్నిటికీ కారణమైన శ్రీ విశ్వకర్మ గోల్డ్ స్మిత్ ప్రైవేట్ లిమిటెడ్ సెంట్రల్ గవర్నమెంట్ క్లస్టర్ నిర్వహణలో నిజాయితీ నిబద్ధత సక్సెస్ చూపించి దక్షిణ భారతదేశంలోనే కాక దేశవ్యాప్తంగా విశ్వకర్మ గోల్డ్ స్మిత్ ప్రైవేట్ లిమిటెడ్ కి ప్రభుత్వం వారిచే అనేక ప్రశంసలు అవార్డులు పొందిన ధనాలకోట శ్రీనివాసరావు వాసు గారిని ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ జయంతి జల సేవా హారతి కార్యక్రమానికి 9వ సంవత్సరం 2024 చైర్మన్ గా ప్రకటించి ఈరోజు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర గారిచే విశ్వకర్మ జయంతి జల సేవా హారతి పోస్టర్ నీ ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ విశ్వకర్మ గోల్డ్ స్మిత్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు టేకీ వెంకటేశ్వరరావు కణితి శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధికార ప్రతినిధి పి సాయికిరణ్ ఆంధ్రప్రదేశ్ బిజెపి విశ్వకర్మ కౌన్సిల్ యోజన కన్వీనర్ కర్రి రాఘవ మరియు పెద్దలు పాల్గొన్నారు

# ఏపీలో ఉద్యోగుల బదిలీల గడువు మరో వారం పొడిగింపు

అమరావతి సెప్టెంబర్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఏపీలో ఉద్యోగుల బదిలీల గడువును ఈనెల 15 నుంచి మరో వారం రోజుల వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈనెల 22 వరకు గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 23 నుంచి బదిలీలపై నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. అయితే ఎక్సైజ్ శాఖ బదిలీల గడువును సెప్టెంబరు 30 వరకూ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎక్సైజ్‌లో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ను నిన్న రద్దు చేసిన ప్రభుత్వం అధికారులను, సిబ్బందిని ఎక్సైజ్‌శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

దీంతో ఎక్సైజ్‌శాఖలో బదిలీల గడువుకు సమయం పడుతుండడంతో ఈనెల 30 వరకు ఆ శాఖ ఉద్యోగుల బదిలీ గడవును పొడిగించింది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ప్రభుత్వం ఉద్యోగుల బదిలీపై ప్రత్యేక దృష్టిని సారించింది.

ఏళ్ల తరబడిగా బదిలీలకు నోచుకోని ఉద్యోగులు ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసింది. ఈ మేరకు ఈ నెల 1 వ తేదీ నుంచి 15వ తేదీవరకు బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా బదిలీలు ఆలస్యంగా జరుగుతున్నాయి. దీంతో మరోసారి ప్రభుత్వం బదిలీల గడువును మరోవారం పాటు పొడిగించింది.

# 2 వేల కోట్లతో 2026 నాటికి భారత వాతావరణ, శీతోష్ణస్థితి అంచనా వ్యవస్థను మెరుగుపరిచే కార్యక్రమం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 :మిషన్ మౌసంపై న్యూఢిల్లీలోని పృథ్వి భవన్‌లో భూవిజ్ఞానశాస్త్ర మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయి పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

భారత వాతావరణ శాఖ(ఐఎండీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర, నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్(ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్) హెడ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్‌తో కలిసి భూవిజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి(ఎంఓఈఎస్) డాక్టర్ ఎం రవిచంద్రన్ మీడియాతో మాట్లాడారు.

కేంద్ర మంత్రివర్గం సెప్టెంబర్ 11న రెండేళ్ల కాలంలో చేపట్టేందుకు రూ. 2,000 కోట్లతో ప్రతిష్ఠాత్మక మిషన్ మౌసం కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా భారత్‌ను సన్నద్ధం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. దేశంలో వాతావరణ, శీతోష్ణస్థితిని పరిశీలించడం, అర్థం చేసుకోవడం, అధ్యయనం చేయడం, అంచనా వేయడాన్ని మెరుగుపర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. మరింత మెరుగ్గా, ఉపయోగకరంగా, సమయానుగుణంగా సేవలు అందించడం దీని ఉద్దేశ్యం.

ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు భారత్‌ను సన్నద్ధంగా చేయాలనే లక్ష్యంతో మిషన్ మౌసం కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వాతావరణ మార్పు ప్రభావాన్ని, తీవ్ర వాతావరణ పరిస్థితులను తగ్గించడం, ప్రజలు వీటిని తట్టుకునేలా పటిష్టం చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. 2024-26 మధ్యకాలంలో మిషన్ మౌసంను అమలు చేస్తారు.

నూతనంగా 50 డాప్లర్ వెదర్ రాడార్లు(డీడబ్ల్యూఆర్), 60 రేడియో సాండే/రేడియో విండ్(ఆర్ఎస్/ఆర్‌డబ్ల్యూ) కేంద్రాలు, 100 డిస్ట్రోమీటర్లు, 10 విండ్ ప్రొఫైలర్లు, 25 రేడియోమీటర్లు, ఒక అర్బన్ టెస్ట్ బెడ్, ఒక ప్రాసెస్ టెస్ట్ బెడ్, ఒక సముద్ర పరిశోధన కేంద్రం, ఎగువ వాయువును పరిశీలించగల సామర్థ్యంతో 10 మెరైన్ ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం.

ప్రాంతాల వారీగా, స్వల్పకాలంలో మెరుగ్గా వాతావరణ అంచనాలు, వాయు నాణ్యత సమాచారం చెప్పడానికి, దీర్ఘకాలంలో వాతావరణ నిర్వహణను మిషన్ మౌసం మెరుగుపరుస్తుందని ఎంఓఈఎస్ కార్యదర్శి తెలిపారు. "2026 మార్చి నాటికి వాతావరణాన్ని మెరుగ్గా పరిశీలించేందుకు రాడార్ల వ్యవస్థను విస్తృతం చేయాలని, విండ్ ప్రొఫైలర్లను, రేడియో మీటర్లను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాం. వాతావరణ అంచనాకు సంబంధించిన ప్రక్రియలను, శాస్త్రాలను మెరుగ్గా అర్థం చేసుకోవాలని భావిస్తున్నాం. వాతావరణ పరిశీలనలకు సంబంధించి మెరుగైన సమాచారాన్ని సేకరిస్తాం. వాతావరణ అంచనాలను మెరుగుపర్చడానికి మేం భౌతికశాస్త్ర ఆధారిత సంఖ్యా పద్ధతులను, కృత్రిమ మేథ, మెషీన్ లెర్నింగ్ ఆధారిత సమాచారాన్ని వినియోగిస్తాం. వాతావరణ శాస్త్రాల్లో పురోగతి కోసం మరిన్ని ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను చూడబోతున్నాం'' అని డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు.

ప్రజలకు మేలు జరిగేలా సామర్థ్య నిర్మాణంతో పాటు సమాచార, సేవలను విస్తరించనున్నారు. దేశంలో ఏ వాతావరణ వ్యవస్థను కూడా పరిగణనలోకి తీసుకోకుండా వదిలిపెట్టరు. వాతావరణ, శీతోష్ణస్థితి, ప్రకృతి విపత్తులకు సంబంధించి ఎంఓఈఎస్ మెరుగైన సేవలు అందిస్తుందని, తద్వారా వివిధ రంగాలకు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు అందటానికి దోహదపడుతుందని డాక్టర్ రవిచంద్రన్ పేర్కొన్నారు.

ఎంఓఈఎస్‌కు చెందిన మూడు సంస్థలైన ఐఎండీ, ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెట్రియాలజీ ప్రాథమికంగా మిషన్ మౌసం కార్యక్రమాన్ని అమలు చేస్తాయి. ఈ సంస్థలకు ఎంఓఈఎస్‌కు చెందిన ఇతర సంస్థలు (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ) సహకరిస్తాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, విద్యాసంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యం ఉంటుంది. తద్వారా వాతావరణ, శీతోష్ణస్థితి శాస్త్రాలు, సేవల్లో భారత్ నాయకత్వాన్ని మరింత పెంపొందించవచ్చు

# నవంబరు 30 వరకు 'జీవన్ ప్రమాణ్' ద్వారా పింఛనుదారులకు 'డీఎల్‌సీ ప్రచార ఉద్యమం 3.0'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 :పింఛను - పింఛనుదారుల సంక్షేమ విభాగం 'డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్' (డీఎల్‌సీ) సంబంధిత ప్రచార ఉద్యమాలను 2022 వ, 2023 వ సంవత్సరాలలో విజయవంతంగా నిర్వహించింది. దీనికి గాను ఈ విభాగం పింఛనును పంపిణీ చేస్తున్న బ్యాంకులతో, పింఛనుదారు సంక్షేమ సంఘాలతో, యుఐడిఎఐ, 'జీవన్ ప్రమాణ్' తో కలసి పనిచేయనుంది. 2023లో 'డీఎల్‌సీ ప్రచార ఉద్యమం 2.0'ను 100 నగరాల్లో నిర్వహించగా, 1.45 కోట్ల మంది పింఛనుదారులు వారి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించారు. 'డీఎల్‌సీ ప్రచార ఉద్యమం 3.0'ను ఈ సంవత్సరంలో నవంబరు 1వ తేదీ మొదలు నవంబరు 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పింఛను-పింఛనుదారుల సంక్షేమ విభాగం ప్రకటించింది. 'డీఎల్‌సీ క్యాంపెయిన్ 3.0'ను భారతదేశం అంతటా అన్ని జిల్లా ప్రధాన కేంద్రాలలో, ప్రధాన నగరాలలో నిర్వహించనున్నారు. పింఛనును అందిస్తున్న బ్యాంకులు, పింఛనుదారు సంక్షేమ సంఘాలు, యుఐడిఎఐలతో పాటు 'జీవన్ ప్రమాణ్' లు 157 నగరాల్లో డీఎల్‌సీ ప్రచార ఉద్యమాన్ని నిర్వహించనున్నాయి. అన్ని జిల్లా ప్రధాన కేంద్రాలలో 'డీఎల్‌సీ క్యాంపెయిన్ 3.0'ను నిర్వహించడానికి పింఛను-పింఛనుదారుల సంక్షేమ విభాగం ఇటు తపాలా విభాగంతోను, అటు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపిపిబి)తోను కలసి పనిచేయనుంది. డీఎల్‌సీ క్యాంపెయిన్ 3.0 ను దేశవ్యాప్తంగా అన్ని జిల్లా తపాలా కార్యాలయాలలో నిర్వహించనున్నారు.

అన్ని జిల్లా తపాలా కార్యాలయాల్లో డీఎల్‌సీ ప్రచార ఉద్యమం 3.0 నిర్వహణ సంబంధి రూపురేఖలను తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన ఒక సన్నాహక సమావేశాన్ని కార్యదర్శి (పిడిపిడబ్ల్యు) శ్రీ వి. శ్రీనివాస్ నిన్నటి రోజున నిర్వహించారు. ఈ సమావేశంలో తపాలా సేవల డైరెక్టర్ జనరల్ శ్రీ సంజయ్ శరణ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పోస్ట్ స్ శ్రీమతి రాజుల్ భట్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) ఎమ్‌డి & సిఇఒ శ్రీ ఆర్. విశ్వేశ్వరన్, ఐపిపిబి సిజిఎమ్ శ్రీ గురు శరణ్ రాయ్ బన్సల్ లు పాల్గొన్నారు. పింఛను- పింఛనుదారుల సంక్షేమ విభాగంలో ఉన్నతాధికారులైన సంయుక్త కార్యదర్శి శ్రీ ధ్రుబజ్యోతి సేన్ గుప్త, డైరెక్టర్ శ్రీ రవి కిరణ్ ఉబాలే ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. 'డీఎల్‌సీ క్యాంపెయిన్ 3.0'ను జిల్లా తపాలా కార్యాలయాలలో నిర్వహించడానికి పింఛనుదారు సంక్షేమ సంఘాలకు, పింఛనును అందిస్తున్న బ్యాంకులకు, యుఐడిఎఐ కి, 'జీవన్ ప్రమాణ్' కు జిల్లా తపాలా కార్యాలయాలు తోడ్పాటును అందించాలని అంగీకారం కుదిరింది. పింఛనుదారులు ఏండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ లో ముఖ ప్రమాణీకరణ (ఫేస్ ఆథెంటికేషన్)ను ఉపయోగించి 'జీవన్ ప్రమాణ్' ను జిల్లా తపాలా కార్యాలయాలలో దాఖలు చేయవచ్చు. పెద్ద వయస్సుగల వారికి వారి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ)లను నిబంధనల మేరకు దాఖలు చేయాలని చెప్పి, ఆ పనిని పూర్తి చేయడంలో సహకరించేందుకు పింఛనుదారు ఇంటికే తపాలా విభాగం వారు వెళ్ళి సేవలను అందించే వెసులుబాటు కూడా ఉంది. బేనర్ లను ప్రదర్శించడం, సామాజిక ప్రసార మాధ్యమాల వేదికను ఉపయోగించుకోవడం, సంక్షిప్త సందేశ సేవ (ఎస్ఎమ్ఎస్), ఇంకా చిన్న వీడియోల ద్వారా డీఎల్‌సీ 3.0 ప్రచార ఉద్యమాన్ని గురించిన చైతన్యాన్ని వ్యాప్తి చేయడానికి ప్రచారాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించనున్నారు. శిబిరాల నిర్వహణ లో అవసరమైన సాంకేతిక సమర్థనను యుఐడిఎఐ, ఎలక్ట్రానిక్స్-సమాచార సాంకేతిక విజ్ఞాన మంత్రిత్వ శాఖ (ఓవతిబిజ)లు అందించనున్నాయి. వివిధ విభాగాల మధ్య ఈ విధమైన తోడ్పాటు పింఛనుదారులకు డిజిటల్ మాధ్యమం పరంగా సాధికారితను కల్పించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను ముమ్మరం చేయడంలోను, పింఛనుదారులకు జీవన సౌలభ్యాన్ని ఇప్పటికన్నా మరింత ఎక్కువ స్థాయికి పెంచడంలోను దోహదం చేయగలదని ఆశిస్తున్నారు.

# ఎయిర్ పోర్ట్ విస్తరణ జూన్‌లోగా పూర్తి- కేంద్రమంత్రి



### -ఎయిర్‌పోర్టు పనులను లేట్ చేయొద్దు
### -వచ్చే జూన్ వరకే టార్గెట్
### -పనుల్లో జాప్యం దేనికి అవుతోంది
### -నిధులు.. మెటీరియల్‌కు కొరత లేదు
### -వరదలొచ్చాయనే వంక చూపొద్దు
### -రోజువారీ పని వివరాలు వాట్సాప్‌లో అప్‌డేట్ చేయండి
### -విజయవాడ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రి రామ్మోహన్ సీరియస్

అమరావతి, సెప్టెంబర్ 14 :నిధులకు కొరత లేదు. మెటీరియల్ ఉంది. కానీ పనులు ఎందుకు సాగటం లేదు. ఇకమీదట అలా కుదరదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం గన్నవరం విమానాశ్రయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై సీరియస్ అయ్యారు. రోజూ చేసిన పని చేసినట్టు వాట్సాప్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రతి నెల ఈ పనుల పురోగతిని రివ్యూ చేస్తానని చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీలు బాలశౌరి, సీఎం రమేష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సాధారణ పరిపాలన విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఇతర అధికారులతో కలిసి విజయవాడ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు.

### వచ్చే జూన్ వరకు పూర్తి కావాలి..

విజయవాడ విమానాశ్రయ అభివృద్ధి పనులు అత్యంత వేగంగా జరగాలని, జూన్ 2025 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ అన్నారు. ఆ దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. విమానాశ్రయ అభివృద్ధి పనులు ఇప్పటి వరకు 52 శాతం మాత్రమే పూర్తి చేయడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిధులు, మెటీరియల్ కొరత లేకపోయినా పనుల ఆలస్యానికి కారణాలపై ఆరా తీశారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా పనులు కొంతమేర మందగించాయని, వేగవంతం చేసి నిర్దేశిత సమయానికి పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

విజయవాడ విమానాశ్రయ విస్తరణలో భూ సమస్యలు, కోర్టు వివాదాలు, ఏలూరు కాల్వపై వంతెన నిర్మాణం, రైతులకు పరిహారం చెల్లింపు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గన్నవరం విమానాశ్రయ జనరల్ మేనేజర్ రామాచారి, డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి పాల్గొన్నారు.


# ప్రాథమిక వైద్యం ముసుగులో అర్హతకు మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపిలు

### - తెలియని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్ఎంపిలు
### - ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోగులకు ఇంజక్షన్లు, సెలైన్ లు స్టేరాయిడ్లు, హై అండ్ యాంటీ బయోటిక్స్ వేస్తున్నా ఆర్ఎంపిలు
### - కాసుల కమిషన్ల కోసం రోగులను రిఫర్ చేసే కేంద్రాలుగా మారుతున్న కొన్ని ఆర్ఎంపి క్లినిక్ లు
### - ఆర్ఎంపీలకు కమిషన్లు ఇస్తూ రిఫరల్ పద్ధతిని ప్రోత్సహిస్తూ వైద్య ఎథిక్స్ ని దెబ్బతీస్తున్న అర్హత కలిగిన డాక్టర్ల (బ్లాక్ షిప్ ల) యొక్క రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి
### - అంతా తెలిసిన నిమ్మకు నీరెత్తినట్టు చీమకుట్టనట్లు వ్యవహరిస్తున్న జిల్లా వైద్యాధికారులు వైఖరి నశించాలి

ఖమ్మం, సెప్టెంబర్ 14 : (నేటినిజం ప్రతినిధి): గల్లీగల్లీకి వెలుస్తున్న ఆర్ఎంపీ క్లినిక్స్, అనుమతి లేని రక్త పరీక్షా కేంద్రాలు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నాయి. విచ్చలవిడి వైద్యంతో ప్రాణాలతో చెలగాటమాడుతు, పరిధి దాటి వైద్యం చేస్తున్న కొందరు ఆర్ఎంపీలు పేదల ప్రాణాలు తీస్తున్నారు. కనీస పరిజ్ఞానం లేని కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్యపరీక్షలు చేస్తు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం, సొంతంగా మందులు రాయడం, ఇంజక్షన్లు వేయడం చేస్తున్నారు. కొద్దినెలల పాటు ఆర్ఎంపీలకు అసిస్టెంట్లుగా పనిచేసిన వారు సైతం గ్రామాల్లో ధనార్జనే ధ్యేయంగా సొంతంగా ఆసుపత్రి పెడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### - ధనార్జనే ధ్యేయంగా అడ్డగోలు వైద్యం

ఎప్పుడో కాలం చెల్లిన నిబంధనలను ఆసరాగా చేసుకుని కొందరు ఆర్ఎంపీలు ధనార్జనే ధ్యేయంగా వైద్యం చేస్తున్నారు. ప్రాథమిక చికిత్స అందించాల్సి వీరు ఏకంగా ప్రత్యేక భవనాల్లో పడకలు



ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు. భారీ ఫ్లెక్సీల ఏర్పాటు చేసుకుని ప్రచారం చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల క్లినిక్ పక్కనే మందుల దుకాణం కూడ నిర్వహిస్తుండడం గమనార్హం. పరిమితులు దాటి చేస్తున్న వైద్యం రోగులకు ప్రాణ సంకటంగా మారింది. జిల్లాలో ఎలాంటి అనుమతి లేకుండా ఆర్ఎంపీలు కొందరు పెద్ద పెద్ద భవనాల్లో ఆసుపత్రి నిర్వహిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

### - ప్రాణాలు పోతున్నా చర్యలేవి..?

ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తున్నా వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఓ వైపు ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..? అంటూ ప్రజలు నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది డాక్టర్లను పూర్తిస్థాయిలో ప్రభుత్వము నియమిస్తే ఆర్ఎంపీల ఘటనలో పునరావృతం కాకుండా ఉంటాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వము ఆ దిశగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆర్ఎంపీలు చేసే వైద్యంతో మృత్యువాత పడకుండా ప్రజలు కోరుకుంటున్నారు, చర్యలు తీసుకోవాలి.

### - అనుమతి లేదు అయినా పర్లేదు

### - కిల్లింగ్ ఇంజక్షన్స్

ఇటీవల పెనగడప ఘటన, నిన్న నవభారత్ లో బాలుడి మృతి చెందిన ఘటనలో ఆర్ఎంపీలు చేసిన ఇంజక్షన్ ఏమిటన్న సందేహం వ్యక్తం అవుతుంది. ఉన్న రోగం తగ్గించమంటే వచ్చి రాని వైద్యంతో ఏకంగా ప్రాణాలు తీస్తున్నారన్నది స్పష్టంగా కనపడుతుంది. ఆర్ఎంపీలు చేస్తున్న వైద్యం, వారు ఇస్తున్న 'కిల్లింగ్ ఇంజక్షన్' ఏంటన్నది వైద్యాధికారులు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన నూతన న్యాయ చట్టం ప్రకారం నిర్లక్ష్యంగా వైద్యం చేసి రోగి ప్రాణాలు తీసిన డాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. భారతీయ న్యాయ సంహిత-2023'లోని 106సెక్షన్ ప్రకారం డాక్టర్ అయితే ఐదేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా, ఆర్ఎంపీకి (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) రెండేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం వుంది. ఇవన్నీ చట్టాలు తెలిసినా కూడా ఆర్ఎంపీల తీరు మాత్రం మారట్లేదు.

# ఇద్దరితో ప్రేమాయణం... ఆపై థియేటర్లోనే కత్తితో దాడి..



తిరుపతి, సెప్టెంబర్ 14 :తిరుపతిలో విద్యార్థులు రెచ్చిపోయారు. నగరంలోని ఓ సినిమా థియేటర్‌ల యువకుడు కత్తిపోట్లకు గురైన ఘటన కలకలం సృష్టిస్తోంది. ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేశాడు. తిరుపతిలోని పీజీఆర్ సినిమా థియేటర్‌లో ఈ ఘటన జరిగింది. గాయపడిన విద్యార్థి లోకేశ్‌ను మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) విద్యార్థిగా గుర్తించారు. దాడి చేసిన యువకుడు కార్తిక్, యువతి అక్కడి నుంచి పరారయ్యారు. ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు గాయపడిన కార్తిక్‌ను ఆస్పత్రికి తరలించారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మోహన్‌బాబు యూనివర్సిటీ విద్యార్థి లోకేశ్ ఓ యువతితో కలిసి స్థానిక పీజీఆర్ థియేటర్‌లో సినిమాకు వెళ్లాడు.

ఈ సందర్భంగా అక్కడే ఉన్న కార్తిక్ కత్తితో లోకేశ్‌పై దాడి చేసి గాయపర్చాడు. కత్తితో దాడి చేసిన తరువాత కార్తీక్‌తో కలిసి యువతి పరారైంది. ఇద్దరు యువకుల తో యువతి ప్రేమాయణం నడిపినట్లు సమాచారం.

యువతి పక్కా ప్లాన్‌తో హత్యాయత్నం చేయించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో లోకేశ్‌కు యువతే సినిమా టికెట్లు బుక్ చేసినట్లు తెలిసింది. పథకం ప్రకారమే కార్తిక్‌తో యువతి దాడి చేయించిందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. పరారైన ఇద్దరిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన లోకేశ్‌ది ప్రకాశం జిల్లా గిద్దలూరు అని.. కత్తితో దాడి చేసిన కార్తిక్, యువతి ఇద్దరూ సూళ్లూరుపేటకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

# హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో కొనసాగుతోన్న సంజౌలి మసీదు వివాదం

సిమ్లు సెప్టెంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో సంజౌలి మసీదు వివాదం కొనసాగుతోంది. ఈ మసీదును అక్రమంగా నిర్మించారంటూ హిందూ సంఘాలు, స్థానికులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ మసీదును కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మసీదు కూల్చాలంటూ ఆందోళన చేపట్టిన నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేసిన విషయం తెలిసిందే. దీనికి నిరసనగా నేడు హిమాచల్ వ్యాప్తంగా హిందూ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో స్థానికులు ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలో సిమ్లా, కులు సహా ప్రధాన నగరాల్లో దుకాణాలను మూసివేశారు. మరోవైపు బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అన్ని ప్రాంతాల్లోనూ పోలీసులు భారీగా మోహరించారు.

# ఎన్యూమరేషన్‌లో ఆఫీసర్లు బిజీబిజీ..

### -పేర్లు లేకపోతే సచివాలయంలో నమోదు
### -అప్పటికప్పుడు ఇన్సూరెన్స్ క్లెయిమ్ లు సెటిల్
### -మరమ్మత్తులకు 200మంది టెక్నిషియన్లు రెడీ
### -ఎలక్ట్రానిక్ పరికరాల రిపేర్లు ఫ్రీ
### -స్పేర్ పార్టులకు 50శాతం రాయితీ

అమరావతి, సెప్టెంబర్ 14 : విజయవాడలో బుడమేరు వరద బాధితుల ఎన్యుమరేషన్ లో ఎన్టీఆర్ జిల్లా అధికారులు బిజీబిజీ అయ్యారు. ఆదివారం సాయంత్రం లోపు నష్టాల నివేదికను ప్రభుత్వానికి అందించే పనిలో నిమగ్నమయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు రీవెరిఫికేషన్ (క్రాస్ చెక్) జరుపుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.సృజన శనివారం నగరంలోని సింగ్‌నగర్, వాంబే కాలనీల్లో పర్యటించి నష్టం వివరాల డేటా రీవెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా వరద బాధితులతో కలెక్టర్ సృజన మాట్లాడుతూ జిల్లాలో వరద ముంపు నష్టాల నమోదు ప్రక్రియను దాదాపు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఏ కారణం చేతనైనా పేర్లు నమోదు కాని బాధితులకు సచివాలయాల్లో మరో అవకాశం కల్పించి క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్




వివరాలను యాప్‌లో నమోదు చేస్తామన్నారు.

నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తామన్నారు. ముంపునీటిలో నష్టపోయిన గ్రౌండ్ ఫ్లోర్ నివాసితులు, మొదటి అంతస్తులో ఎలాంటి నష్టం జరిగినా, ఆ వివరాలను కూడా సేకరించి, నివేదికలో పొందుపరచాలని ఎన్యూమరేషన్ బృందాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దెబ్బతిన్న వాహనాలకు, ఇతర ఆస్తులకు ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను సెటిల్ చేసుకోవాలన్నారు. దాదాపు 20ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు తమ పరిధిలో అప్పటికప్పుడే క్లెయిమ్‌లను సెటిల్ చేసి బాధితులకు సహకరిస్తున్నట్టు తెలిపారు. సింగ్ నగర్, వాంబే కాలనీ, భవానీపురం, పాయకాపురం, కండ్రిక, వైఎస్ఆర్ కాలనీ, రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో మెప్మా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుసంధానంతో అర్బన్ కంపెనీ యాప్ సేవలను అందుబాటులో ఉంచారు. మెప్మా ఆర్పీలు, సిబ్బంది తమ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి అవసరమైన సేవలు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించాలని కలెక్టర్ సూచించారు. ఈ రిక్వెస్ట్‌ల ఆధారంగా టెక్నీషియన్లు స్వయంగా బాధితుల ఇళ్లకు వెళ్లి సేవలం దిస్తున్నట్లు వివరించారు. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పెయింటర్, కార్పెంటర్, ఏసీ మెకానిక్, టీవీ టెక్నీషియన్ ఇలా వివిధ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. దాదాపు 200మంది టెక్నీషియన్లు ఈ పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. అవసరం మేరకు బయట ప్రాంతాల నుంచి కూడా టెక్నీషియన్లను రప్పించి సేవలందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పాడైన ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర విషయంలో ఆయా కంపెనీలు లేబర్ ఛార్జీల్లో పూర్తిగా, స్పేర్ పార్ట్స్‌లో 50శాతం మేర రాయితీ కల్పిస్తూ సేవలందించేలా చేస్తున్నామని కలెక్టర్ సృజన వివరించారు.

# 21న ట్యాంక్ బండ్‌పై కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి..

**-తొలి మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ముచ్చట**
**-సామజిక తెలంగాణ సాధన దిశగా అడుగులు.**
**- ప్రభుత్వాలు మారినా ఆగని నేతన్నల ఆత్మహత్యలు**
**-బీసీ రాజ్యాధికార సమితిక అధ్యక్షులు దాసు సురేశ్**

హైదరాబాద్ సెప్టెంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఈనెల 21వ తేదీన ట్యాంక్ బండ్ పై గల జలదృశ్యం వద్ద ఘనంగా నిర్వహించి తొలి మలి దశ ఉద్యమకారులను, బాపూజీ సహచరులను ఆహ్వానించనున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ తెలిపారు.. శనివారం కేంద్ర కార్యాలయం నందు జరిగిన ముఖ్య ప్రతినిధుల సమావేశంలో 21 న నిర్వహింప తలపెట్టిన బాపూజీ వర్ధంతి కార్యక్రమంపై చర్చించారు..తదనంతరం దాసు సురేశ్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ 3 దశల్లో చేసిన భారత స్వాతంత్ర , తెలంగాణ తొలి తుది దశ పోరాటాల ఫలాలు అట్టడుగు , బలహీన వర్గాల ప్రజలకు నేటికీ అందడం లేదని, ఇప్పటికీ తెలంగాణలో దొరల రాజ్యమే నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు .. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ,రాష్ట్రంలో కులగణన చేస్తామని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కామారెడ్డి వేదికగా హామీ ఇచ్చినా నేటికీ హామీ నీటిమూటగానే ఉందని అభిప్రాయపడ్డారు..పదేళ్లుగా అంధకారంలో మగ్గుతున్న ఆత్మహత్య బాధిత నేతన్నల కుటుంబాల దయనీయ స్థితిగతులపై విచారం వ్యక్తం చేసారు.. ప్రభుత్వాలు మారుతున్నా నేతన్నల ఆత్మహత్యలు ఆగక వారి కుటుంబాలు దయనీయ స్థితికి చేరుకుంటున్నాయన్నారు.. ఒక పక్క ంఖీూ ,కాంగ్రెస్ , బీజేపీ ప్రభుత్వాలు పోటీపడి బాపూజీ పేరున యుూనివర్సిటీలు, స్టాంపులు సృష్టిస్తున్నాయే తప్ప గత పదేళ్లుగా మృతిచెందిన 400 మంది ఆత్మహత్య బాధిత కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. ఆత్మహత్య బాధిత నేతన్న కుటుంబ మహిళలు వారి పిల్లల్ని సాకలేక, కుటుంభ భారాన్ని మోయలేక తీవ్ర అవస్థలను ఎదుర్కొనుంటున్న విషయం ప్రభుత్వానికి తెలిసినా వారి పట్ల కనీస కనికరం చూపకపోవడం, వారి



కుటుంబాలను ఆడుకోకపోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచిదికాదన్నారు..బాపూజీ కలలుగన్న సామాజిక , సబ్బండ వర్గాల తెలంగాణ సాకారం అవ్వడానికి తొలి మలిదశ తెలంగాణ ఉద్యమకారులను వర్ధంతి కార్యక్రమానికి ఆహ్వానించనున్నామని దాసు సురేశ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో హామీ ఇచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికలలో సాధ్యం చేసుకునేలా ఉద్యమకారులతో ఆత్మావలోకనం నిర్వహించనున్నామన్నారు. చేనేత ఆత్మహత్య బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు , పది లక్షల ఎక్సుగ్రేషియా సాధించుకునే విధంగా ట్యాంక్ బండ్ వేదికగా 21 నుండి తమ కార్యాచరణను సిద్ధం చేసుకోనున్నామని దాసు సురేశ్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు బోనం ఊర్మిళ, బండారు పద్మావతి, గోషిక స్వప్న, ఉద్యోగ సంఘాల నాయకులు దానకర్ణాచారి, జర్నలిస్టు మారేపల్లి లక్ష్మణ్, రాజు ముదిరాజ్, అనిల్ ,పలు సామాజిక ఉద్యమ కారులు, వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు..

# అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరును “శ్రీ విజయపురం” గా మార్పు

**-పోర్ట్ బ్లెయిర్ పేరును కేంద్రప్రభుత్వం మార్చడం హర్షణీయం పవన్ కళ్యాణ్**

అమరావతి సెప్టెంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేంద్రపాలిత ప్రాంతం, అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరును “శ్రీ విజయపురం” గా కేంద్రప్రభుత్వం మార్పు చేసింది. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పోర్ట్ బ్లెయిర్ పేరును కేంద్రప్రభుత్వం మార్చడం సంతోమని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్‌లో పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని పవన్ కళ్యాణ్ అన్నారు.వందల ఏళ్ల పాటు పాశ్చాత్య దేశాల బానిసత్వ మూలాలకు నిదర్శనంగా, వలసవాద పాలనకు గుర్తుగా వారు పెట్టిన పేరును తీసేస్తూ, భారతదేశం సాధించిన విజయాలకు గుర్తుగా “శ్రీ విజయపురం'' పేరు పెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమని కేంద్ర ప్రభుత్వాన్ని పవన్ కళ్యాణ్ కొనియాడారు. భావితరాలపై వలసవాద విధానాల ప్రభావం పడకుండా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు

# క్రీడల అభివృద్ధికి కేంద్రం కృషి.. ధర్మపురి అరవింద్

**-సైక్లింగ్ లీగ్ పోటీలను ప్రారంభించిన ఎంపీ**

నిజామాబాద్, సెప్టెంబర్ 14 : కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులను




ప్రోత్సహించేలా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారం నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ మహిళల సైక్లింగ్ లీగ్ పోటీలను ఎంపీ ధర్మపురి అరవింద్ జెండా ఊపి ప్రారంభించాను. ఖేలో ఇండియా ద్వారా నిజామాబాద్ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ కుమారి నిషా విద్యార్థి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి, నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కృపాకర్ రెడ్డి, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకాంతరావు, వందలాది మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు.

# ప్రతి దాన్ని రాజకీయం చేయడం విజయసాయిరెడ్డి అలవాటుగా మారింది

విశాఖపట్నం, సెప్టెంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సింహాచలం వరాహ నరసింహస్వామిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో రాజ్యసభ సభ్యులు విజయసారెడ్డి చేసిన ట్విట్‌పై ఎమ్మెల్యే స్పందించారు. విజయసాయిరెడ్డి పరిస్థితి దురదృష్టకరంగా మారిందన్నారు. ప్రతి దాన్ని రాజకీయం చేయడం ఆయనకు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు.గత ప్రభుత్వంలో తాను స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. స్పీకర్ ఆమోదించడం కూడా జరిగిందన్నారు. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ పార్టీ ఎంపీగా ఉన్న విజయ్ సాయి రెడ్డి రాజీనామా చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్‌పై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామిని రప్పించి... స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని స్పష్టం చేశారని తెలిపారు.స్థానిక ఎంపీ భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా శాయశక్తుల ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని తెలిపారు. విజయసాయిరెడ్డి రాజకీయాలు చేయాలనుకుంటే.. వేరేలా చేసుకోవడం మంచిది అంటూ హితవుపలికారు. విజయసాయి రెడ్డికి స్టీల్ ప్లాంట్ వ్యవహారంపై చిత్తశుద్ధి ఉంటే ఆనాడే రాజీనామా చేసి ఉంటే బాగుండేదన్నారు. విజయసాయిరెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారంటూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# తెలుగు సాహిత్య చరిత్రలోనే రచయిత్రి మొల్లమాంబకు ప్రత్యేక స్థానం

**-ఏపీ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**
**-విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మొల్ల కాంస్య విగ్రహం ప్రారంభోత్సవం**

విజయవాడ సెప్టెంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలుగు సాహిత్య చరిత్రలోనే రచయిత్రి మొల్లమాంబకు ప్రత్యేక స్థానం ఉందని ఏపీ గనులు,



ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మొల్ల కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర, మైసూర్ మహారాజు, ఎంపీ, యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ..'' తెలుగు జాతికి మె?ల్ల ఓ విలువైన రత్నం. ఆది కవి నన్నయ్య అయితే ఆది కవయిత్రి మొల్ల. మె?దటి తెలుగు కవియిత్రిగా తెలుగువారి గుండెల్లో ఆమెకు ప్రత్యేక స్థానం ఉంది. ఆరు కాండాలు, 871పద్యాలతో రామాయణాన్ని కేవలం ఐదు రోజుల్లో రచించడం ఆమె విజ్ఞానానికి నిదర్శనం. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆమె అనువాదం ఉంటుంది. మె?ల్లను ఆదర్శంగా తీసుకుని విద్యార్థినిలు ముందుకెళ్లాలి. ఆమె స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి దేశానికి కీర్తి తీసుకురావాలి. తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ సంకల్పించాలి. మాతృభాషలో చదువుకున్నప్పుడే అన్నీ అంశాలపై అవగాహన పెరుగుతుంది. చేతి, కుల వృత్తులను కాపాడుకోవాలి'' అని అన్నారు.కర్ణాటక, తెలుగు రాష్ట్రాలకు శతాబ్దాలుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని మైసూర్ మహారాజు, ఎంపీ, యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ అన్నారు. తెలుగు, కన్నడ భాషలు ఎంతో గొప్పవని ఆయన చెప్పారు. తెలుగు కవయిత్రి మొల్ల ధీరవనిత అని కృష్ణదత్త కొనియాడారు. ఆనాటి కాలంలో ఎలాంటి రాజస్థానాల అండా లేకుండా ఆమె రామాయణాన్ని అచ్చ తెలుగులో రాసి శ్రీరాముడికి అంకితమిచ్చారని ప్రశంసించారు. శ్రీ కృష్ణదేవరాయల కాలం నాటి నుంచి కర్ణాటక, ఆంధ్ర మధ్య మంచి సత్సంబంధాలు ఉన్నాయని ఆయన చెప్పుకొచ్చారు. ఒకప్పుడు మైసూర్ ఆస్థానంలో ఎందరో తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తెలుగు సంతతివారేనని, దేశవ్యాప్తంగా ఆయన ఎంతో కీర్తిప్రతిష్ఠలు గడించారని'' చెప్పారు.

# వైద్యవిద్య అందించాలంటే ప్రమాణాలు పాటించాల్సిందే...

**-వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్**

రాజమండ్రి, సెప్టెంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గత ప్రభుత్వంలో రూ.8,840 కోట్లు వైద్య కళాశాల నిర్మాణానికి ఖర్చు చేయాల్సి ఉందని... కానీ రూ.2120 కోట్లు మాత్రమే ఖర్చు చేరాని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. దాంట్లో కూడా 700 కోట్లు బకాయిలు పడ్డారని తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో సీట్లు అడ్డుకున్నారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కళాశాల నిర్మాణం కాకుండా, వసతులు లేకుండా ఎలా ప్రారంభించాలని ప్రశ్నించారు. వైద్యవిద్య అందించాలంటే ప్రమాణాలుంటాయని.. అవి పాటించకుండా చేస్తే ప్రజల ప్రాణాలతో ఆడుకున్నట్టే అని అన్నారు. వైద్య విద్య కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు దీనిపై అవగాహన చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 12 కళాశాలలో రాబోయే ఏడాదికి విద్యా సంవత్సరం ప్రారంభిస్తామన్నారు. రూ.10 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పుపెట్టివెళ్లిందన్నారు. ఏపీ బ్యావరేజ్ కార్పొరేషన్ మీద ముందుగానే అప్పు చేసిన ఘనత జగన్‌దే అంటూ వ్యాఖ్యలు చేశారు. 13 సార్లు గత ప్రభుత్వంలో ఆరోశ్యశ్రీ మీద నోటీసులు ఇచ్చాయి ఆసుపత్రి యాజమాన్యాలు. గత ప్రభుత్వం రూ.2500 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లింది... ఇప్పటి వరకు రూ.652 కోట్లు తాము బకాయిలు చెల్లించామని తెలిపారు. వచ్చిన మూడు నెలల్లోనే వేలాది కోట్లు బకాయిలు చెల్లించడం భారమే.. కానీ గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు. సదరన్ సర్టిఫికెట్ల అంశంలో సర్వే జరుగుతుందని... తప్పుడు సర్టిఫికేట్లు పెట్టిన వారి పించన్‌లు తొలగిస్తామన్నారు. ఫేక్ సర్టిఫికెట్స్ ఇచ్చారని తేలితే వైద్యులపైన చర్యలు తప్పవని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

# రూ.34 లక్షల గంజాయి పట్టివేత.. 8మంది అరెస్ట్



హైదరాబాద్, సెప్టెంబర్ 14 :గుట్టు చప్పుడు కాకుండా ఒడిశా నుండి హైదరాబాద్ కు పెద్ద ఎత్తున తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శనివారం ఒడిస్సా నుండి హైదరాబాద్ కు తరలిస్తున్న 174కిలోల గంజాయిని హయత్ నగర్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ మహ్మద్ ఖురేషి తెలియజేశారు.

గంజాయి అక్రమ రవాణా దారుల నుండి ఒక మహేంద్ర పికప్ వ్యాన్, హుండాయ్ కార్ తో పాటు 8మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు, ఒడిశాకు చెందిన ముగ్గురు తక్కువ సమయంలో ఎక్కువ మొత్తం సంపాదించాలనే దురాశతో గంజాయి రవాణాకు పాల్పడుతున్నారన్నారు. గంజాయి సరఫరా చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. మీడియా సమావేశంలో ఎక్సైజ్ ఏసీపీ తులా శ్రీనివాస్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# బిజెపి నాయకురాలు బండారు గాయత్రీ దేవి ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు...




కరీంనగర్, సెప్టెంబర్ 14 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ 32వ డివిజన్ లో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు నిర్మాణ మరమ్మతుల కోసం స్థానిక బిజెపి నాయకురాలు బండారి గాయత్రి దేవి, కార్యకర్తలు ముందుకు వచ్చారు. ముఖ్యంగా డివిజన్లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులతో స్థానిక ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా గుంతల మయంగా మారిన అధికారులు ఎలాంటి చర్యలు చేపటకపోవడంతో బండారు గాయత్రి ఆధ్వర్యంలో స్థానిక బిజెపి కార్యకర్తలు స్వచ్ఛందంగా సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రహదారిపై ఉన్న గుంతలను కాంక్రీట్ డస్ట్ తో మూసివేశారు. ప్రధానంగా సోమవారం రోజున జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది , అసౌకర్యం తలెత్తకుండా ఉండేందుకు తమ వంతు ప్రయత్నం చేశామని గాయత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్థానిక నాయకులు కార్యకర్తలు తాదూరి కిరణ్ రెడ్డి, శ్రీనివాస్, వినోద్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన శ్రీనివాస్



ఖమ్మం, సెప్టెంబర్ 14 : (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో జడ్పిహెచ్ఎస్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని తనికెళ్ల గ్రామ మాజీ ఉపసర్పంచ్ చిన్న కుమారుడు శ్రీనివాస్ తనికెళ్ళ గ్రామంలో ప్రారంభించారు. అదేవిధంగా మండపంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విఘ్నేశ్వరుడు అందరి విఘ్నాలు తొలగించి కరుణా కటాక్షాలు కురిపించాలని, ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని వినాయకుని కోరినట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు, తదితరులున్నారు.



# అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన నాయకులు



ఖమ్మం, సెప్టెంబర్ 14 : (నేటినిజం ప్రతినిధి): కామేపల్లి మండలం పండితాపురం బస్టాండు సెంటర్లో, గ్రామంలోని డిబి సెంటర్లోని గణేష్ మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. శనివారం నాడు పూజ అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్.కె ఫతే మహమ్మద్, జిల్లా అఖిలభారత యాదవ యోజన అధ్యక్షులు చిత్తారి సింహాద్రి యాదవ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ... ఇప్పటివరకు గణేష్ మండపాలలో కులాలు, మతాలు రాజకీయాలకతీతంగా ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇదేవిధంగా సోమవారం జరిగే ఊరేగింపు కార్యక్రమాన్ని నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని యువకులను ఉద్దేశించి చెప్పారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులను అభినందించి, సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బండారు ప్రభాకర్, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బద్దల శేఖర్, మేకల మహేష్ బాబు, బానోతు నరసింహ నాయక్, మేకపోతుల మహేష్, శీలం పుల్లయ్య, చల్ల మల్లయ్య, కేతబోయిన వెంకటేష్, కేతబోయిన రాంబాబు, పల్లపు ప్రతాప్, అంబడిపూడి వెంకటయ్య, చింతల వెంకయ్య, రాయల నాగ శంకర్, దాసరి గురేష్, సతీష్, ఆర్ఎంపి, ఎస్.కె మస్తాన్, పి.ప్రసాద్, బి.వినయ్, సురేష్, పల్లె సంగయ్య, భరత్ యాదవ్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ కోసం విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

**-వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి డిమాండ్**

అమరావతి సెప్టెంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనే కేంద్రం నిర్ణయానికి నిరసనగా ప్రస్తుత వైజాగ్ పార్లమెంటు సభ్యుడు భరత్ మతుకుమల్లి , స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెంటనే రాజీనామా చేయాలని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి ఎక్స్ వేదిక ద్వారా డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 2021 ఫిబ్రవరిలో తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. గంటా శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకుని ఎంపీ , ఎమ్మెల్యే రాజీనామా చేయకపోయినా, ప్రభుత్వంపై వత్తిడి చేయకపోయినా చరిత్ర వారిని ద్రోహులుగా, మోసగాళ్లుగా పరిగణిసుందని పేర్కొన్నారు. ప్రజలు వారిద్దరినీ క్షమించరని, వారు చేసిన ద్రోహానికి ప్రజలు వారిద్దరికీ గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు హయాంలో వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ ప్రక్రియ మొదలైందని , బ్లాస్ట్ ఫర్నేస్-3 ను నిలిపివేయడం స్టీల్ ఫ్యాక్టరీ ఉద్యోగుల గొంతు కోయడమేనని ఆరోపించారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్నా చంద్రబాబు స్టీల్ ఫ్యాక్టరీని కొనసాగించే ప్రయత్నం చేయకపోవడం క్షమించరాని ద్రోహమని విమర్శించారు. టీడీపీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ఏ మాత్రం పట్టింపు ఉన్నా చంద్రబాబు తక్షణం ఎన్డీఏ ప్రభుత్వానికి మద్ధతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంపదను అమ్మకానికి పెడ్తుంటే వైస్సార్ కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసి వైజాగ్ స్టీల్ ను రక్షించే దాకా పోరాటం సాగిస్తుందని వెల్లడించారు.

